

# కళాజీవి

డి. సూర్యభగవానులు

చంద్రం చక్కదనాల కుప్ప. కలయింటి బిడ్డ. ఎప్పుడూ శరీరం మనసూ పరిశుభ్రంగా ఉంటాయి. కళా జీవనంలోని ఆనందాన్ని అర్థం చేసికొన్నాడు. నిరాడంబరములోని నిర్మలత్వం, స్వతంత్ర జీవనంలోని మాధుర్యాన్ని ఎరిగి అందుకు అలవాటు పడ్డాడు. సంతృప్తి స్వచ్ఛమైన అంతరాత్మ సౌందర్యోపాసనలు ప్రశాంత సౌఖ్యజీవితానికి ప్రధానమనుకున్నాడు. అదే సన్నిహిత మార్గముకూడా అనుకున్నాడు ప్రపంచంలో. అన్నిటికంటె అతనికిఅభిమానవిద్య చిత్రలేఖనం. ఎప్పుడూ కుంచి విడువడు. సౌందర్యానికి స్థానమిచ్చే ప్రతి వస్తువు ప్రాణతుల్యం అతనికి. "A thing of beauty is a joy for ever" అనేవాడు. కళా సముపార్జనకు, కళోద్ధారణకు అన్న పానాదులను కూడా లెక్కచేసేవాడు కాదు. అంత కళాపిపాసి కనుకనే అతను దిద్ది తీర్చిన బొమ్మలను ఎందరి కళారాధకుల హృదయాలల్లోనో గౌరవాభి మానాలను పాదుకొల్పాయి. అందుకు సాక్ష్యం కావాలంటే అతను రాసిన బొమ్మలు ఆకుంచే ఆధారం.

ఏ పురాతన కృతాన్నో సౌఖ్య ప్రదమైన వివాహం జరిగింది. చంద్రం భార్యరత్నం అన్నిటికీ అందు బొందిగ్గా వుంటూంది. ఆమె సాధారణ సౌమ్యమైన శాంతయుత సంతృప్తి జీవనం గడుపుచున్నది.

చంద్రం తన కళనంతా రత్నంతో ప్రతిఫలింపజేస్తుండేవాడు. తనకుంచి ప్రభావంచే రత్నం సౌందర్య సమర్చనలతో కీర్తి వెలగబెట్టాడు. తనకుంచిని తనయిష్టమొచ్చినట్లుగా వుపయోగించుకొనేవాడు. అందుకు అడ్డు వుండేదికాదు. సౌందర్యోపాసకుడైన ఆమెభర్త ఆమెను ఒకవిలాస వస్తువువలె వుపయోగించుకుంటున్నాడు. కళకోసం తన జీవితాన్ని గడపాలనుకున్నాడు. కాని అలాగ జీవితాలు గడచిపోతూంటే చీకూ చింతా లేకపోయేది!

రత్నం బాగా పూర్తిగా రేకులువిప్పిన పువ్వు. ఆమె తనభర్త గీచిన ప్రతిబొమ్మను గంటలకొలది చూచి సంతోషించేది. ఒకొక్కప్పుడు భర్తగీచిన చిట్టిబొమ్మలు చూచి ఏదో ఆకళ్లు కోరికను చూపేది. ఆ ముద్దువచ్చే పసిపాపలను చూస్తూండేది తానూ ఒక పసిపిల్లలా. ఇరుగు పొరుగు పసిబిడ్డలను తెచ్చి ముద్దాడుకొంటూ భర్తకు చూపేది. భావ ప్రకటన చేసేది సంతాన కాంక్షను. కాని

అతను ఆ బిడ్డలను కళాదృష్టితో చూచేవాడు కాని...

దినాలు గడుస్తున్నాయి. రత్నానికి సంతాన కాంక్ష ఎక్కువైంది. పసిపాపలను ప్రీతితో చూచుట, దగ్గరకు చేరదీయుటలో తన కాలాన్ని పొద్దుపుస్తూంది కాని ఎన్నాళ్లీని పరుల బిడ్డలతో తృప్తి పడుతుంది. యింతకూ ఆమెకు పదహారు ఏండ్లు, యింకా క్రొత్త కాపురంలోని మాధుర్యాన్ని చవిచూడలేదు. ఆమె త్వరలో తల్లిని కావాలని వేయి దేవుళ్లకు మ్రొక్కేది పాపం. వ్రతాలు చేసేది. వుపవాసాలు చేసేది. చివరకు బుద్ధ భగవానుడులా వైరాగ్యం జెందింది. ఆ జపతపాలలో ఏమీ లేదనుకుంది. ఈ శరీరమే అన్నిటికి కారణ మనుకుంది. ఆమె భర్త ఆమెకు కావలసింది ఏమిటో తెలిసికో లేక పోయాడు. పాపం ఏం తెలుస్తుంది. కళలో లీనమయ్యాడు. కళే అతను, అతనే కళా. ఆ కళా మూర్తి ఎప్పుడూ కళలో మునుగుతూ తేలుతూ వుండేవాడు. ఇంకా వేరె తలంపుకు తావెక్కడ.

అది యౌవ్వన సౌందర్య ప్రతిభా విలాసము. జాత్యం, కోరికలు గుండెలమీద గ్రుద్దుతున్నాయి. రత్నం నేడు అనివార్యమైన అనుభవంకోసం తహతహ లాడుతుంది. ఏ నిగ్రహానికి లొంగని తీవ్రకోరికలు అనుభవానికి రానప్పుడు మానవ జీవితాన్ని సంక్షోభం పెట్టుతవిగదా! రోజులు గడిచిన కొలది రత్నం తన కాంక్షలను అరికట్టలేకపోయింది. ఆ కోరిక కోసం క్షణ క్షణంమారే భావాలకు బానిస అయింది. దుర్బల మనస్క అయింది. ఆ వాంఛాతృష్ణకోసం తన శరీరాన్ని కాల్చుకొని చస్తూంది ఎన్నో దినాలనుంచి.

ఆడవాళ్ల ఆకలి, అభిరుచి తెలిసికోలేని మన కళామూర్తి చెన్నపట్టణం చిత్రప్రదర్శనానికి వెళ్లాడు, తన ప్రియశిష్యున్ని వదలి వారమయింది యింకా రాలేదు. ఆ శిష్యుడు అతి సౌందర్యవంతుడు. రత్నం అతనితో ఎక్కువ చనవుగా వుండేది. యితను చనవు చూపేవాడు. ఆమె చనవులో స్వార్థం లేక పోలేదు. చితికి పోతున్న తన సౌఖ్యాన్ని సింహావలోకనం చేసికొని చింతిం మతూంది. తన కోరికలు చంపుకుంటున్నానని కుమిలి కుమిలి ఏడుస్తూంది. ఆమె కామవాంఛ, సంతాన కాంక్షను తెలిసికోలేక పోలేదు అతను.

ఒకనాడు రాత్రి ఆమె ఆశిష్యుడూ పండు వెన్నెల్లో పరవశమై పోతున్నారు. వాళ్ళ పరవశానికి ఆ చెట్లనుంచి వచ్చే పరిమళవాయువు, ఆ ఒంటరితనమూ, ఆ వెన్నెల, ఆమె కోరికను మరింత బలీయం చేసినవి. ఏదో అపూర్వమైన కొంటె ఆనందం రేకెత్తింది. పొంగి పొంగి వచ్చే జాత్యోద్రేకం అరికట్టలేక పోయింది.

"..................."

వద్దు తల్లీ! తప్పు తప్పు! అని బ్రతిమాలాడు.

తప్పేంటని ఆడది అడిగితే...సార్గ సౌఖ్యం కైవసం చేసికున్నారు క్షణంలో.

మరునాడు వుదయం చంద్రం వచ్చాడు చిరునవ్వుతో కలకల లాడుతూ, తాను పొందిన యోగ్యతా పత్రాలు, బహుమతులు భార్యకు శిష్యునకు చూపాడు. వాళ్ళ ఆనందానికి అంతం లేదు. తిరిగి చంద్రం తన పనిలో ఏక దృష్టితో

నిమగ్నుడై వుంటూ కాలం గడుపుతున్నాడు నిశ్చింతగా.

కాలచక్రం తిరుగుతోనే వుంది. ఆమె రహస్యం గుట్టు చెడకుండానే వస్తూవుంది. అంతః పురంలో ఏంచేసినా ఎన్నాళ్ళకైనా గుట్టురట్టు కాదు.

రోజులు గడుస్తున్నాయి. రత్నం చక్కని బిడ్డనుకంది. క్రమసంతానం కానీ, అక్రమ సంతానం కానీ ఒకనాడు రత్నం చంటిబిడ్డను వుయ్యాల్లో వేసి జోలపాట పాడుతుంది. ఆ శ్రవణానంద కరమగు గానానికి చంద్రుడువచ్చి చూచాడు,

ఆమె తనభర్త సంతోషిస్తాడనుకొని కులుకు తుంది. అతను ఆమెను చూసాడు. రెండు అశ్రుధారలు అప్రయత్నంగా రాలినవి బుగ్గల మీద, అవి మెరుస్తున్నాయి ముత్యాలలా. తన కళంతా నాశనమైన దనుకున్నాడు. అప్పటి రత్నానికి యిప్పటి రత్నానికి ఎంతో మార్పు కనిపించింది కళ్ళలో.

ఆ కాంతు లీనే కళ్ళల్లో కాంతేలేదు. ఒకప్పుడు సర్వాంగ సుందరిగానున్న రత్నం నేడు సర్వమంగళ మయింది. రత్నం రాయయింది. ఆనాటి అందమైన అంగసౌష్టం లేదు. చొట్ట బుగ్గల్తో, లొట్టకన్నుల్తో బక్క పీనుగలా వుంది చూడ. చక్కని సుందరి నేడు చూస్తానికి అసహ్యం వికారమయింది. సౌందర్యం తొణ కాసుతున్న వదనం, ఆ చిరునవ్వు చిందులు


దేహానికి ఆహారము ఎంత అవసరమో వెంట్రుకలకున్నూ అంత అవసరమే

జగత్ప్రసిద్ధమయిన "కామినియా" తైలము (రిజిష్టర్డు)



వుపయోగించండి

రోమరాజము చక్కగ వృద్ధి అయ్యే మూలికలతో అది తయారు చేయబడినది. చలవ చేస్తుంది. ఇంపు అయిన వాసన వేస్తుంది.

ఒక సీసా 1 రూపాయి. 3 సీసాలు రూ. 2—10—0

వి. పి. చార్జి ప్రత్యేకం. అర్ధణా పోష్టుబిళ్లకు శాంపిలు పంపుతారు

ఒట్టో దిల్ బహార్



ఆకర్షణీయ మయిన సుగంధము కలది. అనేక అపరూప పుష్పములతో తయారు అయినది. శాంపిలు 2 అణాల బిళ్లకు పంపుతారు. వి. పి. చార్జి ప్రత్యేకం.

వెల పావు ఔన్సు సీసా రూ. 1-4-0. ఒక డ్రామ్ 12 అణాలు

సోలు ఏజంట్లు

ది ఆంగ్లో యిండియన్ డ్రగ్ & కెమికల్ కంపెని

బొంబాయి 2

త్రొక్కుచున్న పెదవులు, అందం వొలకపోసుకుంటూన్న ఆ శిఖలోని పూలు వింత మెరుగు నూత్న శోభనిచ్చేది అవన్నీ గతదినాలు అయింది.

"ఇక నాకు రత్నం వద్దు" అనుకున్నాడు. ఆనాటి కళాముఖం రాదనుకున్నాడు. అందానికి కూడా అంత ముందనుకున్నాడు. ఆడవాళ్లు



వట్టి పిల్లల్నికనే యంత్రమని దానితో వాళ్ళ అందానికి అంతమని అనుకున్నాడు. ఛీ! యిక నాకొద్దు అని మనసును మార్చుకున్నాడు. నేటితో ,కుంచికి కళకు స్వస్తి అనుకున్నాడు.

కళోద్ధరణకు అంతమదినమనుకున్నాడు. దినాలు గడిచిన కొలది ఆమె అందం దినాదినాభి వృద్ధగుతుంది. ఆరు నెలలలో నూత్న శోభతో రెట్టింపు అందంతో వుంది. చంటి బిడ్డను ఎత్తుకొని భర్తముందు నిలిచింది. భర్త ఆశ్చర్యపోయాడు నూత్న వికాసంతో కనబడుతూన్న భార్యను చూచాడు. అప్రయత్నంగా చేయి జాచాడు. ఆనంద బాష్పాలు రాల్చాడు.

నేడు మన కళాజీవికి లోకస్వభావం బోధపడింది.

:——